క్లుప్తంగా

నగర ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు వెస్ట్: నగర ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు స్పష్టం చేశారు. రోడ్లకు యుద్ధప్రాతిపదికపై ప్యాచ్ వర్క్ చేపట్టాలని, దీర్ఘకాలిక లక్ష్యాలతో పనిచేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కె.ఎస్.లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు ఎండీ.నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గార్బేజీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ఏర్పాటుకు నాలుగు రోజుల్లో స్థలాలను ఫైనలైజ్ చేయాలని చెప్పారు. మరమ్మతులకు గురైన ఈ–ఆటోలను మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలన్నారు. గోరంట్ల కొండమీద రిజర్వాయర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని చెప్పారు.

కార్యవర్గ ఎన్నికలపై నర్సుల సంఘం సమాయత్తం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు పాటించాల్సిన నియమ, నిబంధనలపై శుక్రవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. నర్సుల సంఘం నేతలు వెల్లంపల్లి పద్మజ, బెల్లంకొండ శైలజ మాట్లాడుతూ నర్సుల సంఘం ఎన్నికలు తొలుత జిల్లా కార్యవర్గానికి మాత్రమే నిర్వహించాలని ఈనెల 1న ఎన్నికల అధికారి తమకు ఆదేశాలు ఇచ్చారన్నారు. గతంలో మాదిరిగా కాకుండా జిల్లా కార్యవర్గానికి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ పోస్టులతోపాటు, ఐదుగురు ఈసీ మెంబర్లను ఎన్నికల ద్వారా మాత్రమే ఎన్నుకోవాలని, గతంలో మాదిరిగా ఈసీ మెంబర్లను నామినేట్ చేయడం కుదరదని తెలిపారు. జిల్లా కార్యవర్గం ఎన్నిక తరువాత అన్ని జిల్లాల వారు కలిసి రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని వివరించారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి సంఘంలో సభ్యత్వం ఐదు సంవత్సరాలు కలిగిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు నర్సింగ్ అభ్యర్థులు గతంలోనే సభ్యత్వం కలిగి ఉండాలని, తాజాగా సభ్యత్వం తీసుకుంటే అనుమతి లభించదని స్పష్టం చేశారు. నూతన ఎన్నికల నియమావళి ప్రకారం సంఘ సభ్యులంతా అప్రమత్తంగా ఉండి, ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో పలువురు నర్సుల సంఘం నేతలు పాల్గొన్నారు.

మహిళను బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై కేసు

లక్ష్మీపురం: అప్పు చెల్లించినప్పటికీ, ఇంకా చెల్లించాలంటూ మెసేజ్‌లు చేస్తూ బెదిరిస్తున్న వారిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి రోడ్డు కొండయ్య కాలనీకి చెందిన చేబ్రోలు యామిని విజయవాడకు చెందిన వెంకటేష్ వద్ద రూ. లక్ష అప్పుగా తీసుకుంది. కొంతకాలం అనంతరం ఫోన్ ద్వారా చెల్లించింది. అయితే, వెంకటేష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు యామినికి వడ్డీతో పాటు రూ. 8 లక్షలు చెల్లించాల్సి ఉందని ఫోన్‌లు చేయడంతో పాటు బెదిరింపులకు గురి చేస్తున్నారు. వాటిని భరించలేక బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు మాయం

గొలుసు మాయంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కొరిటిపాడు 4వ లైనుకు చెందిన డేగల లక్ష్మి రెండో అంతస్తులో నివాసం ఉంటోంది. సెప్టెంబరు 28న కింద గదిలో ఉన్న తన చిన్నపాపకు భోజనం పెట్టేందుకు వెళ్లే సమయంలో మెడలోని చైన్‌ను గదిలో పెట్టి వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి కనిపించలేదు. వెతికినా కనిపించకపోవడంతో శుక్రవారం రాత్రి అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టిన రోజు వేడుకలకు దూరం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాలు, పరిస్థితులు, వరదల బీభత్సం నుంచి ఇంకా తేరుకోని బాధితుల దుస్థితి, సమస్యలతో ప్రజలు సతమతమవుతున్న ప్రస్తుత సమయంలో తాను పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగంగా తన పుట్టినరోజు వేడుకలు జరపవద్దని పార్టీ శ్రేణులు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఎక్కడా కేక్ కటింగ్‌లు గానీ, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు గానీ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

అజాగ్రత్తతో కాలేయానికి కష్టకాలం

- పెరుగుతున్న వ్యాధి బాధితులు
- అక్టోబర్ లివర్‌క్యాన్సర్ అవగాహన నెల
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



లివర్ క్యాన్సర్ పోస్టర్లు

గుంటూరు మెడికల్: కాలేయం (లివర్) మన శరీరంలో అతి పెద్ద గ్రంథి. అది సక్రమంగాపనిచేయకపోతే అనేక రోగాలు చుట్టుముడతాయి. ఆధునిక జీవనశైలితో లివర్ వ్యాధుల బారిన పడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మన దేశంలో అత్యధిక సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా వెల్లడించింది. సకాలంలో గుర్తించి వైద్యం చేయించని పక్షంలో లివర్ క్యాన్సరుగా మారుతుంది. అక్టోబర్ నెలను లివర్ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

లివర్ బాధితులు...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్ధారణ పరీక్షలు చేయగా 7,992 మంది వ్యాధి బారిన పడినట్లు తేలింది. జిల్లాలో పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉండగా ప్రతి రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఐదు నుంచి పది మంది లివర్ సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌కు వారంలో మూడు రోజులు ఉండే ఓపీ వైద్య విభాగానికి ఒక్కో రోజు 20 మందికి పైగా లివర్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

కాలేయ సమస్యలకు ముఖ్యకారణాలు

మత్తు పదార్థాలు తాగడం, పొగ తాగటం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం, ఇన్‌ఫెక్షన్స్ వలన కాలేయ సమస్యలు వస్తాయి. హెపటైటిస్ బి, సి, ఈ వ్యాధులు సోకుతాయి. శారీరక వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం వల్ల కొవ్వు పెరిగి కాలేయంపై పేరుకు పోతుంది. శరీరానికి హానిచేసే మందులు ఎక్కువగా తీసుకోవటం వల్ల కూడా కాలేయ సమస్యలు తలెత్తుతాయి. తెల్లగా ఉండే కళ్లు పసుపు పచ్చగా, గోళ్లు పసుపు రంగులో మారితే కామెర్ల సమస్యలు ఉన్నట్లు భావించి అశ్రద్ధ చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

కాలేయాన్ని ఇలా కాపాడుకోవాలి...



ఆల్కహాల్ వల్ల లివర్ దెబ్బతింటుంది. మద్యం జోలికి వెళ్లొద్దు. కొవ్వు పదార్థాలు, వేపుళ్లు అతిగా తినవద్దు. ఉప్పు, చక్కెర, రెడ్‌మీట్ ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు. పచ్చని ఆకుకూరలు తినటం వల్ల లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి. ఆలీవ్ ఆయిల్స్, వాల్‌నట్స్, గ్రీన్ టీ, ఆపిల్ పండ్లు, వెల్లుల్లిపాయలు, పసుపు లివర్‌కు మేలు చేస్తాయి. విటమిన్ సీ ఎక్కువగా తీసుకుంటే కాలేయం వద్ద పేరుకుపోయే కొవ్వును నియంత్రణ చేస్తుంది. రోజూ నీటిని ఎక్కువగా తాగడం వల్ల కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది.

–డాక్టర్ ఆళ్ల సిద్ధార్థరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

లివర్ క్యాన్సర్లు పెరుగుతున్నాయి



ఆధునిక జీవనశైలి వల్ల నేడు లివర్ క్యాన్సర్‌లు పెరుగుతున్నాయి. చిన్నపిల్లల్లో హెపటోబ్లాస్టోమా అనే లివర్ క్యాన్సర్‌లు వస్తున్నాయి. జన్యుపరమైన లోపాలతో వస్తున్న ఈ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్‌లకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్‌లకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఉచితంగా ఆపరేషన్లు, వైద్యసేవలు అందిస్తున్నారు.

–డాక్టర్ ఎం.జి. నాగకిశోర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో లివర్ మార్పిడికి సన్నాహాలు



గుంటూరు జీజీహెచ్‌లో లివర్ వ్యాధులకు అన్నిరకాల వైద్య చికిత్సలు ఉచితంగా చేస్తున్నాం. వారంలో ఆరు రోజులపాటు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో లివర్ సంబంధిత బాధితులకు చికిత్స అందిస్తున్నాం. లివర్ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

వారధి కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్



స్థానికులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ

లక్ష్మీపురం: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వసంతరాయపురం మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్యల్ని స్థానికులు తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన సూచించారు. గంజాయి, బెల్టు షాపుల్ని పూర్తిగా నిరోధిస్తున్నామని తెలిపారు. యువతకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. యువతకు మంచి విద్యతో పాటు వారిలో నైపుణ్యతను వెలికి తీసేందుకు కృషి చేయాలని సూచించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది, అధికారులు కూడా ప్రజలతో స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని చెప్పారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికం అవుతున్న నేపథ్యంలో వివరాలను ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. సెల్‌ఫోన్‌లో మొబైల్ యాప్‌లు, ఆఫర్ యాప్‌లను క్లిక్‌చేసి మోసపోవద్దని ఎస్పీ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకుల పేర్లు చెప్పి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని చెప్పారు. మహిళలు కూడా ఆఫర్ల పేరుతో మొబైల్ యాప్‌లలో వచ్చే వాటిని కొనుగోలు చేసి మోసపోవద్దని తెలిపారు. దసరా సెలవులకు ఊరు వెళ్లేవారు సంబంధిత స్టేషన్‌లో సమాచారం తెలియజేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం స్థానికులు ఎస్పీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ జయరాం ప్రసాద్, అరండల్‌పేట సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు వాకర్స్ అసోసియేషన్ వితరణ



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న అసోసియేన్ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.లక్షా 75వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కు రూపంలో సీఎం చంద్రబాబుకు అందజేసినట్లు స్నేహ పరిమళం వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి. రాము, గౌరవాధ్యక్షుడు డాక్టర్ రాజా సిద్ధార్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ చౌదరి, కార్యదర్శి త్రిపురమల్లు అశోక్‌కుమార్, సభ్యులు డి. చౌడేశ్వరరావు, కె. ఉదయ్ శంకర్, ఏ. శివరామకృష్ణ, వెంకటరమణ, వీఎల్ నరసింహారావు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

శ్రీ చైతన్య ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభం



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏజీఎం దుర్గాప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఇంటర్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ శ్రీచైతన్య ఆధ్వర్యంలో పోటీల్ని నిర్వహించడం మంచి పరిణామమని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా భావి క్రీడాకారులుగా ఎదగవచ్చని సూచించారు. శ్రీ చైతన్య ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మూడు రోజులపాటు క్రికెట్, షటిల్, వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, 100 మీటర్ల పరుగు, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ స్టేడియంతో పాటు బ్రాడీపేటలోని ఎల్ఈఎం స్కూల్ గ్రౌండ్, బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీచైతన్య గ్రౌండ్‌లలో పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు అశోక్, చిష్టీ బాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్‌జీ, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కరీం, జోనల్ ప్రిన్సిపాల్ కిశోర్, సాయి, పీడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు, పద్మజ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నరసరావుపేటలోని మున్సిపల్ హైస్కూల్లో గత నెల 30న జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికల్లో భాగంగా అండర్–14లో ఏ. అభినయ, ఏ. శశి షణ్ముఖ్, అండర్–17లో బి. సుధారాణి, ఏ. అక్షయ, వి.జ్ఞాన చరిత, ఏ. నిహారిక ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కోచ్ కె.రవి, ప్రోత్సహించిన తల్లిదండ్రులను విష్ణువర్ధన్‌తో పాటు పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ అభినందించారు.

ఏపీఎంఈడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యచంద్రరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీఎంఈడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 'ది రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఎమర్జింగ్ ఇండియా' పుస్తకాన్ని ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సీఈవో ఆచార్య డి. సూర్యచంద్రరావు ఆవిష్కరించారు. తాడేపల్లిలోని కమిషన్ కార్యాలయంలో శుక్రవారం పుస్తకావిష్కరణ చేసినట్లు గుంటూరుకు చెందిన అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. రమేష్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం. వసంతరావు, డాక్టర్ అనంతలక్ష్మి, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ నిర్మల, రవి, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు చిన్నారుల ఎంపిక



ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్‌తో తైక్వాండో విద్యార్థులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): తిరుపతిలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు తమ విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారని కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ కాశీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభకనబరచిన అండర్–14 బాలికల విభాగం నుంచి ఎన్.నన్విత, బి.రమ్యశ్రీ, బి.హర్షవర్ధిని, అండర్– 17 బాలురల్లో వి.భానుప్రవీణ్, జె.దినకర్, షేక్ అబ్దుల్ లుక్మన్, అండర్–17 బాలికల్లో అనంతలక్ష్మి ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థుల్ని పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ కార్యాలయంలో అభినందించారని తెలిపారు.

విశ్వ వినోదిని..విష్ణు విలాసిని నమోస్తుతే !



ఎస్‌వీ ఎన్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బాల త్రిపురసుందరీదేవిగా..



రవీంద్రనగర్ శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరాజరాజేశ్వరిగా..



మల్లికార్జునపేట శివాలయంలో మహాలక్ష్మీదేవిగా..



కొరిటిపాడు గాంధీబొమ్మ సెంటర్‌లోని కోదండ రామాలయంలో గాయత్రీదేవిగా..



ఏటీ అగ్రహారం శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో కామాక్షి దేవిగా..

గుంటూరు నగరంలో దేవీ శరన్నవరాత్రులు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం అమ్మవారికి అత్యంత ఇష్టమైన రోజుకావడంతో విశేష పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో శ్రీ అన్నపూర్ణాదేవిగా, శ్రీ రాజరాజేశ్వరిగా, కామాక్షిదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు క్యూలైన్లల్లో బారులుతీరారు. అమ్మవార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. – నగరంపాలెం



సంపత్‌నగర్ శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో హంస వాహన అలంకారం



శ్రీచుట్టుగుంట పోలేరమ్మతల్లి దేవస్థానంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..



మారుతీనగర్‌లోని శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో అన్నపూర్ణాదేవిగా ..



అరండల్‌పేట అష్టలక్ష్మీ మందిరంలో శ్రీ గాయత్రీ మాతగా.. .



బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా..

అన్నమయ్య కృతులు అమృతపు గుళికలు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవం



లక్ష్మీపురం: అన్నమయ్య కృతులు శ్రోతులకు అమృతపు గుళికలని సినీ సంగీత విశ్లేషకులు ఎ.అమరాచారి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. అమరాచారి మాట్లాడుతూ అన్నమయ్య సాహిత్యంలోని భావ కవిత్వం, ఆధ్యాత్మిక సారం తీవ్ర భావోద్వేగానికి గురి చేస్తాయని తెలిపారు. అమృత తుల్యమైన త్యాగయ్య రాగాలు శ్రోతలకు ఎనలేని ఆనందం కలిగిస్తాయని చెప్పారు. సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య ఆధ్యాత్మిక ప్రేమ జలధిలో మునిగి భక్తి పదాలను పల్లవించారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీకేఆర్ హైస్కూల్లో దసరా వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ ఏటీ అగ్రహారం, పట్టాభిపురం క్యాంపస్‌లలో శుక్రవారం దసరా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో అమ్మవార్లను తలపింపచేసే విధంగా ముగ్ధ మనోహరంగా ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో అమ్మవారిని పూజించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జి. కొండారెడ్డి, జి.జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల పాల్గొన్నారు.